క్లుప్తంగా

సొసైటీ మాజీ అధ్యక్షుడికి పితృ వియోగం



వెంకట సుబ్బయ్య భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ శివప్రసాదరెడ్డి

కురిచేడు: మండలంలోని పడమర వీరాయపాలెం సొసైటీ మాజీ ప్రెసిడెంట్ ఊట్ల వెంకటేశ్వర్లుకు బుధవారం పితృవియోగం కలిగింది. ఆ విషయం తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి నేరుగా వెళ్లి వెంకటేశ్వర్లు తండ్రిచిన వెంకట సుబ్బయ్య మృతదేహానికి నివాళులర్పించారు. ఊట్ల వెంకటేశ్వర్లుకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట కురిచేడు సొసైటీ మాజీ ప్రెసిడెంట్ మేరువ సుబ్బారెడ్డి, గోగులముడి లింగారెడ్డి, బొరిగర్ల గోవిందు, నుసుం ప్రతాపరెడ్డి, రమణారెడ్డి, నారు శ్రీనివాసులరెడ్డి, పాతకోట వెంకటరెడ్డి, మానం కోటయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అదాలత్

తర్లుపాడు: స్థానిక విద్యుత్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఏఈ హనుమాన్‌నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ బిల్లుల సమస్యల పరిష్కారంతోపాటు వినియోగదారుల సమస్యలు తమ దృష్టికి తీసుకునిరావచ్చన్నారు.మండలంలోనివిద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలనికోరారు. మార్కాపురం ఈఈ పి.నాగేశ్వరరావు, మార్కాపురం ఏడీఈ సీయా నాయక్, ఏఏఓ శేఖర్ పాల్గొంటారని చెప్పారు.

తర్లుపాడులో అగ్నిప్రమాదం



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

తర్లుపాడు: స్థానిక పోలెబోయినవారి బజారులో బుధవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు పక్కన ఉన్న వ్యర్థాల నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పక్కనే గడ్డివాములు ఉండటంతో గ్రామస్తులు భయాందోళనకు గురై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన మార్కాపురం అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



గాయపడిన నాసరయ్య

దొనకొండ: టిప్పర్ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఓ యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని పెదన్నపాలెం చెరువుకట్ట, నాగమయ్య స్వామి గుడి వద్ద బుధవారం రాత్రి జరిగింది. తెలిసిన సమాచారం ప్రకారం.. దొనకొండ నుంచి పొదిలి వైపు టిప్పర్ వెళ్తోంది. వెంకటాపురం నుంచి దొనకొండకు పని కోసం చెట్టూరి బాల నాసరయ్య ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ప్రమాదంలో బాల నాసరయ్యకు కుడి మోకాలు తీవ్రంగా గాయమైంది. మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. పోలీసు సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

కరాటేలో కమలా విద్యార్థుల ప్రతిభ



మెడల్స్ సాధించిన విద్యార్థులు

మార్కాపురం: బాపట్లలో నిర్వహించిన స్టేట్ లెవెల్ కరాటే చాంపియన్‌షిప్‌లో మార్కాపురంలోని కమలా హైస్కూల్ విద్యార్థులు కటాస్, ఫైటింగ్ విభాగాల్లో గోల్డ్ మెడల్స్ సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ స్వరూప్ రంజన్ తెలిపారు. ఫైటింగ్ విభాగంలో తేజోవర్ధన్, కటాస్ విభాగంలో దేవహర్ష, తేజోవర్ధన్ గోల్డ్ మెడల్ సాధించగా, అండర్-11 విభాగంలో టి.కుషాల్ సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. వీరిని కరస్పాండెంట్ పవన్‌కుమార్, డైరెక్టర్ సింధూజ, పీఈటీలు రజనీష్, శ్రీకాంత్ అభినందించారు.

బియ్యం బస్తాలు స్వాధీనం

మేదరమెట్ల: అక్రమంగా తరలిస్తున్న బియ్యం బస్తాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తిమ్మనపాలెం గ్రోత్ సెంటర్ సమీపంలో బుధవారం తెల్లవారిజామున పట్టుకున్నారు. మేదరమెట్ల పోలీసులు తెలిపిన సమాచారం మేరకు తిమ్మనపాలెం కుబేర హోటల్ సమీపంలో అక్రమంగా ఆటోలో బియ్యం బస్తాలను తరలిస్తున్నారన్న సమాచారం రావడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి 34.50 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి నాలుగు చక్రాల ఆటోతో పాటు 69 బియ్యం బస్తాలను మేదరమెట్ల పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

జెండాలు ఎన్ని కలిసినా జగనన్నే సీఎం



మాట్లాడుతున్న డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



ప్రచారంలో నాయకులు, కార్యకర్తల మధ్య డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ శివప్రసాదరెడ్డి
- అయ్యలపాలెం, నాగంబొట్లపాలెంలో బూచేపల్లి ఎన్నికల ప్రచారం

తాళ్లూరు (ముండ్లమూరు): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జెండాలు ఎన్ని కలిసినా జగనన్న ఎజెండా ముందు నిలవ లేవని, జగనన్నే సీఎం అని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని అయ్యలపాలెం, నాగంబొట్లపాలెం గ్రామాల్లో బుధవారం రాత్రి మన ఊరికి-మన శివన్న ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొదట గ్రామంలోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బూచేపల్లి వెంకాయమ్మ, నందిని, శివప్రసాదరెడ్డిలు ప్రధాన వీధుల్లో మహిళలు, అభిమానులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. మహిళలు హారతులు, పూలతో ఘన స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రచార రథంపై వారు మాట్లాడుతూ నాగంబొట్లపాలెం గ్రామానికి తమ కుటుంబానికి విడదీయరాని బంధం ఉందన్నారు. తమ సొంతూరులా ఎప్పుడు వచ్చినా అక్కున చేర్చుకుని ఆదరిస్తున్నారన్నారు. 2004, 2009లో వైఎస్సార్ ఆశీస్సులతో తమ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యేగా ఆదరించి గెలిపించారని, 2024లో జగనన్న ఆశీస్సులతో మరోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని, మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. దేశంలోనే మాట మీద నిలబడి ఎన్నికల మేనిఫెస్టోను 99 శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి అన్నారు. మామను వెన్నుపోటు పొడిచి అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలు అమలు చేయని నారా చంద్రబాబునాయుడు మరోసారి దొంగ హామీలతో మీ ముందుకు వస్తున్నాడని, నమ్మి మోసపోవద్దన్నారు. చంద్రబాబు పాలనఅంతా కరువు మయమని, వర్షాలు లేక చుక్క నీరు కూడా దొరకదన్నారు. బూచేపల్లి కుటుంబానికి కులమతాలు లేవని, తమ వెంట నడిచేవారంతా తమ వాళ్లేనని తెలిపారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అన్ని రంగాల్లో ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహనరెడ్డికే దక్కిందని వెంకాయమ్మ అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల కోసం అమలవుతున్న సంక్షేమ పథకాలు మన ఇంటికే చేరాలంటే జగనన్న కోసం సైనికుల్లా పని చేద్దామన్నారు. ప్రతి ఇంటికి చేకూరిన లబ్ధిని బ్యాంకు ఖాతాలే తెలియజేస్తాయన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్న ఏకైక లక్ష్యం 175/175 అని, మీ బిడ్డగా ఇంటింటికీ వస్తున్న శివప్రసాదరెడ్డిని గెలిపించాలని కోరారు. గ్రామాల్లోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హాజరైన వారందరికీ అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు తూము వెంకట సుబ్బారెడ్డి, చిన్నపరెడ్డి మస్తాన్‌రెడ్డి, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఆదాం షరీఫ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఐవీ సుబ్బారెడ్డి, సర్పంచ్ చిమట సుబ్బారావు, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు సోము అనిల్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు పోశం మధుసూదనరెడ్డి, కోటా రామిరెడ్డి, గోళ్లపాటి మోషే, మాజీ సొసైటీ అధ్యక్షులు శనివారపు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజు, మాజీ జెడ్పీటీసీ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి భీమిరెడ్డి నాగమల్లేశ్వరరెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి జక్కుల రామకృష్ణ, మండల ఎస్సీసెల్ కార్యదర్శి పూనూరి దేవదానం, మాజీ ఏఎంసీ డైరెక్టర్ దుగ్గుల యోగిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు యాదిక యలమందారెడ్డి, జయరామిరెడ్డి, పులి ప్రసాదరెడ్డి, ఛార్లెస్ సర్జన్, మందా శాంసన్, వీరయ్య, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



డాక్టర్ శివప్రసాదరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన బాదాపురం గ్రామస్తులు

15 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక

దొనకొండ: మండలంలోని బాదాపురం గ్రామానికి చెందిన 15 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి బుధవారం చేరాయి. మండల మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, బీసీ సీనియర్ నాయకుడు బత్తుల వెంకట సుబ్బయ్య యాదవ్ ఆధ్వర్యంలో నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి సమక్షంలో చేరారు. వారికి ఆయన కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. తమ కుటుంబాలకు అన్ని వేళల్లో తాము అందుబాటులో ఉంటామని, మీ శివన్నను మీరు మరిచి పోవద్దని కోరారు. వైస్ సర్పంచ్ ఇమ్రాన్‌ఖాన్, ముజాయిద్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు



బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ మస్తాన్‌వలి



సీఐతో అర్ధవీడు, కంభం, బేస్తవారిపేట ఎస్సైలు





తహసీల్దార్ జి.సుజాత తహసీల్దార్ కె.సుజాత

కంభం ఎంపీడీఓగా మస్తాన్‌వలి

కంభం: ఎంపీడీఓగా సయ్యద్ మస్తాన్ వలి బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ జనవరి 31వ తేదీన ఉద్యోగ విరమణ పొందిన నేపథ్యంలో అర్ధవీడు ఎంపీడీఓగా పని చేస్తున్న మస్తాన్‌వలిని కంభం బదిలీ చేసిన నేపథ్యంలో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. నూతన ఎంపీడీఓను కార్యాలయ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు కలిసి అభినందించారు.

దొనకొండ తహసీల్దార్‌గా సుజాత

దొనకొండ: నూతన తహసీల్దార్‌గా కె.సుజాత బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈమె బాపట్ల జిల్లా మార్టూరు నుంచి ఎన్నికల దృష్ట్యా బదిలీపై దొనకొండ వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన సువర్ణ పల్నాడు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ పరంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు.

కంభం సీఐగా రామకోటయ్య

కంభం: పట్టణ సీఐగా జె.రామకోటయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న రాజేష్‌ను సత్తెనపల్లి రూరల్‌కు బదిలీ చేశారు. దర్శి సర్కిల్లో పనిచేస్తున్న రామకోటయ్యను కంభం సర్కిల్‌కు బదిలీ చేశారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట ఎస్సైలు పులి రాజేష్‌కుమార్, నాగమల్లేశ్వరరావు, నరసింహారావులు సీఐను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. సీఐ మాట్లాడుతూ రానున్న ఎన్నికలను ఎస్సైల సహకారంతో పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకొని ప్రజలకు అసౌకర్యం కలగకుండా చేస్తామని తెలిపారు.

పనుల కోసం బ్రోకర్లను ఆశ్రయించొద్దు

దర్శి (కురిచేడు): తహసీల్దార్ కార్యాలయంలో పనుల కోసం ప్రజలు బ్రోకర్లను ఆశ్రయించి ఇబ్బందులు పడవద్దని తహసీల్దార్ జి.సుజాత పేర్కొన్నారు. నూతనంగా బుధవారం బాధ్యతలు చేపట్టిన ఆమె మాట్లాడుతూ ఎవరైనా నేరుగా తన వద్దకు వచ్చి ప నిచేయించుకుని వెళ్లవచ్చని చెప్పారు. పనులు సాగదీయడం, రేపు, ఎల్లుండి అంటూ తిప్పుకోవటం జరగదన్నారు. సాధ్యమైనంత వరకు నిర్దేశించిన సమయంలో పనులు పూర్తి చేస్తామనానరు. వీఆర్వోలు కిందిస్థాయి అధికారులు కూడా ప్రజలను తిప్పుకోకుండా వెంటనే పనులు చేసి పంపాలన్నారు.

ప్రజారోగ్యమే సీఎం జగనన్న లక్ష్యం



మార్కాపురంలో మందులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ కృష్ణ



కంభాలపాడులో వైద్య శిబిరం

మార్కాపురం టౌన్: రాష్ట్రంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండేందుకు సురక్ష కార్యక్రమాన్ని చేపట్టి రెండో విడత అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని ఆరో సచివాలయం పరిధిలోని 10, 11, 12వ వార్డుల్లోని ప్రజలకు మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ, బీసీ కాలనీలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ కృష్ణ మాట్లాడుతూ.. వయోవృద్ధులు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా ఆయా వార్డు పరిధిలో వైద్యశిబిరం నిర్వహించి సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలందరికీ మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నారన్నారు. స్పెషలిస్టు వైద్యులతో పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ రాహుల్, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, డీఈ సుబానీ, నాయకులు ఉత్తమ్‌కుమార్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యమే లక్ష్యం

పొదిలి రూరల్: పేదలకు పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే ప్రభుత్వం లక్ష్యమని డాక్టర్ ఆనందబాబు పేర్కొన్నారు. పొదిలి మండలంలోని కంభాలపాడులో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్న గొప్ప సంకల్పంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వైద్య సేవలు తీసుకొచ్చిందన్నారు. 351మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు ఐదేళ్లలోపు చిన్నారులకు సంపూర్ణ పోషకాహారం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సౌజన్య, శరత్, రేఖ, విజయలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ లేళ్ల శ్రీనివాసరెడ్డి, ఏఎన్‌ంలు, ఆరోగ్య సిబ్బంది, ఆశలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులను సామర్థ్యం ఆధారంగా విభజించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వర్

బేస్తవారిపేట: పదో తరగతి విద్యార్థులను సామర్థ్యం ఆధారంగా గ్రూప్‌లుగా విభజించాలని, నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని మార్కాపురం డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వర్ అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులు ఇష్టపడి చదువుకోవాలని, రివిజన్ చేసుకుంటూ తెలియని విషయాలను ధైర్యంగా ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు. ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని, చదువుకున్న పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై దృష్టి పెట్టి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. హెచ్‌ఎం ఎంఎస్ శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు..అండగా ఉంటా!

- వైఎస్సార్ సీపీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి



నాగిరెడ్డిని పరామర్శిస్తున్న దర్శి ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి

దర్శి (ముండ్లమూరు): వైఎస్సార్ సీపీ కోసం కష్టపడి పని చేసి అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ప్రతి కుటుంబానికి అండగా ఉంటానని దర్శి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి భరోసా ఇచ్చారు. మండలంలోని యర్రఓబనపల్లి, అగ్నిపురి కాలనీ గ్రామాల్లో బుధవారం పలు కుటుంబాలను ఆయన పరామర్శించారు. యర్రఓబనపల్లి గ్రామానికి చెంది అనారోగ్యంతో బాధపడుతున్న పేరం వెంకటరెడ్డిని, ప్రమాదంలో గాయపడిన కైపు బ్రహ్మారెడ్డిని, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న పేరం బాల నాగిరెడ్డిలను పరామర్శించి ఓదార్చారు. చీమలదిన్నె వెంకటస్వామి, బేళ్ల పరమేష్, మెలికా శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అగ్నిపురి కాలనీకి చెందిన గూడూరి విక్టోరియా, గుంటూరి వెంకటేష్, మురికిపూడి శాంసన్, భాగ్యరాజు, గుంటూరి ఎలీశమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

రామిరెడ్డికి బూచేపల్లి పరామర్శ

దర్శి పట్టణంలోని కొత్తపాలెంలో వెన్నపూస రామిరెడ్డి తండ్రి సుబ్బారెడ్డి అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి అక్కడికి చేరుకొని సుబ్బారెడ్డి మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామిరెడ్డికి ధైర్యం చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ కైపు నాగేశ్వరమ్మ సుబ్బారెడ్డి, నాయకులు బాదం రమణారెడ్డి, చీమలదిన్నె కొండయ్య, గుంటూరి విల్సన్, సమాధానం పాల్గొన్నారు.

అర్హులకు నాణ్యమైన వైద్యం



వైద్యులతో నాయకులు, సిబ్బంది

గిద్దలూరు రూరల్: జగనన్న ప్రభుత్వంలో అర్హులకు నాణ్యమైన వైద్యం లభిస్తుందని నగర పంచాయతీ వైస్ చైర్మన్ ఆర్‌డీ రామకృష్ణ అన్నారు. పట్టణంలోని నంద్యాల రోడ్డు పీహెచ్‌సీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యం కోసం వైద్య రంగంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చిందన్నారు. ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైస్ చైర్మన్-2 కాతా దీపిక, డాక్టర్లు ఆషియా, షరీఫ్, కౌన్సిలర్లు గడ్డం భాస్కర్‌రెడ్డి, బాలిరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు మస్తాన్‌వలి, దమ్మాల జనార్దన్, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, శానిటరి ఇన్‌స్పెక్టర్ వలి పాల్గొన్నారు.

మార్కాపురంలో బైక్ చోరీ

మార్కాపురం: ఇంటి ముందు నిలిపి ఉన్న పల్సర్ బైక్ చోరీకి గురైన సంఘటన బుధవారం మార్కాపురం పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై రెహమాన్ తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ కాలనీలో నివాసముండే సాయి మంగళవారం రాత్రి తన ఇంటి ముందు పల్సర్ బైక్ లాక్ చేసి ఉంచాడు. బుధవారం ఉదయం బయటకు వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆదర్శ మహిళ రమాబాయి



రమాబాయికి నివాళులర్పిస్తున్న పెద్దలు

అద్దంకి: ఆదర్శ మహిళ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి అని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేశ్ అన్నారు. స్థానిక బంగ్లా రోడ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆమె జయంతి కార్యక్రమాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. రమాబాయి చిత్రపటానికి నివాళి అర్పించారు. రిటైర్డ్ అర్జేడీ యూదేవపాలన మాట్లాడుతూ రమాబాయి ఆదర్శ జీవి అని అందుకే అంబేడ్కర్ గొప్ప చదువులు చదవగలిగారని చెప్పారు. చెన్నుపల్లి నాగేశ్వరరావు, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, మన్నం త్రిమూర్తులు, అన్నంనేని వెంకట్రావు, చెన్నుపాటి రామాంజనేయులు, బాబూరావు, తెలగతోటి రాధా కృష్ణమూర్తి, జోషప్, మంచు హనుమంతరావు, జె. ప్రభాకరరావు పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

పర్చూరు (చినగంజాం): పర్చూరులో ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రణీత్ పలు వ్యాపార సంస్థలపై దాడులు నిర్వహించారు. బుధవారం వివిధ స్థానిక శీతల పానీయాల విక్రయ కేంద్రాలు, వ్యాపార దుకాణాలు, సూపర్ మార్కెట్‌లో సోదాలు నిర్వహించారు. కాలం చెల్లిన వస్తువులను గుర్తించి వాటిని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోల్‌సేల్ దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని షాపుల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించి సీజ్ చేస్తామని, 14 రోజుల వ్యవధిలో మొత్తం చక్కబెట్టుకోవాలని, లేదంటే కేసులు నమోదు చేస్తామని నోటీసులు జారీ చేశారు.

10న ఈశ్వరీ దేవి మఠం పీఠాధిపతి అద్దంకి రాక

అద్దంకి రూరల్: అద్దంకి కాకాని పాలెంలోని వీర బ్రహ్మేంద్ర స్వామి వారి దేవస్థాన కమిటీ ఆహ్వానం మేరకు ఈనెల 10న ఈశ్వరీదేవి మఠం పీఠాధిపతి వీర శివ కుమారస్వాములు అద్దంకి రానున్నట్లు దేవస్థాన ధర్మకర్త ఉండవల్లి కృష్ణారావు తెలిపారు. బుధవారం దేవస్థానంలో ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. అనంతు సుబ్బారావు, పొన్నపల్లి బ్రహ్మానందం, చెన్నుపల్లి శ్రీనివాసచారి, జాగర్లమూడి శ్రీనివాసరావు, మిద్దెబోయిన ఆంజనేయులు, ఏలూరు వీరబ్రహ్మం, విరాట్ కంప్యూటర్స్ కాలేషా, కొండముది రమేష్ పాల్గొన్నారు.

తీరం వద్ద గుర్తు తెలియని మృతదేహం

వేటపాలెం: రామాపురం సముద్రతీరం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బుధవారం గుర్తించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయనం పుష్యమాసం ఉత్తరాషాడ నక్షత్రం చతుర్దశి తిథి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర బుధవారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.